అతిథుల కిలకిలలు

చెన్నూర్ దట్టమైన అటవీ ప్రాంతంలో అరుదైన పక్షులు, సీతాకోక చిలుకలు సందడి చేస్తున్నాయి. వివిధ రకాల పక్షులు, సీతాకోక చిలుకలు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చినట్లు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ బృందం సభ్యులు గుర్తించారు. చెన్నూర్ అటవీ ప్రాంతంలో 150 రకాల పక్షులు, 72 రకాల సీతాకోకచిలుకలను గుర్తించినట్లు బృందం సభ్యులు తెలిపారు.

- వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు బదిలీ

ఆసిఫాబాద్‌: జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు వరంగల్ అదనపు డీసీపీ(ఆపరేషన్స్ అండ్ క్రైమ్)గా బదిలీ అయ్యారు. మంగళ వారం రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 30 మంది అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌: దివ్యాంగులు మనోధైర్యంతో అన్నిరంగాల్లో రాణించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదర్శ గిరిజన క్రీడా పాఠశాలలో దివ్యాంగులకు నిర్వహించిన క్రీడాపోటీలను జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ప్రతీ రంగంలో ముందుకు సాగాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి డిసెంబర్ 3న నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో కలిసి కలెక్టర్ క్యారమ్ బోర్డు ఆడారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, గోలం వెంకటేశ్, అథ్లెటిక్ కోచ్ విద్యాసాగర్, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రవికుమార్, పీడీ లక్ష్మణ్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ సవరించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: కేంద్ర బడ్జెట్ సవరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ధనవంతుల ఆదాయంపై పన్నులు పెంచి విద్యా, ఆరోగ్యం, వ్యవసాయ రంగాలకు నిధులు కేటాయించాలన్నారు. బొగ్గు బ్లాకుల వేలం నిలిపివేసి, సింగరేణికి గనులు నేరుగా కేటాయించాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లిస్తూ, పింఛన్ రూ.10వేలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు సుధాకర్, మధుసూదన్, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రాజ్యాంగంతో అన్నివర్గాలకు న్యాయం'



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: దేశంలోన్ని అన్నివర్గాలకు రాజ్యాంగంతోనే సమన్యాయం జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ అధ్యక్షతన డ్రాఫ్టింగ్ కమిటీ ప్రజల ఆశయాలు ప్రతిబింబించేలా రాజ్యాంగాన్ని రూపొందించిందన్నారు. రాజ్యాంగ ఫలాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్, నాయకులు పెంటయ్య, మధుకర్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో ఉద్యమించాలి

ఆసిఫాబాద్‌అర్బన్‌: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యతతో ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్ అన్నారు. జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్, కిసాన్ మోర్చా సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట మంగళవారం కాంట్రాక్టు కార్మికులు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లు, విద్యుత్ సవరణ బిల్లు-2013 వెంటనే రద్దు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు సవరించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజేందర్, శ్రీకాంత్, పద్మ, స్వరూప, శారద, మాయ, రూప, కైలాష్, సువర్ణ పాల్గొన్నారు.

కన్నీటి వీడ్కోలు

- స్వగ్రామంలో ఉద్రిక్తతల మధ్య శైలజ అంత్యక్రియలు
- వాంకిడి మండలంలో అడుగడుగునా ఆంక్షలు
- ధాబా గ్రామంలోకి మీడియాను సైతం అనుమతించని పోలీసులు
- చివరి చూపునకు దూరమైన బంధువులు
- పోలీసులు, విద్యార్థి సంఘాల మధ్య వాగ్వాదం
- ఇందిరమ్మ ఇల్లు, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం కోసం డిమాండ్
- నేడు విద్యా సంస్థల బంద్‌కు పిలుపు



అంబులెన్స్ నుంచి శైలజ మృతదేహం దించుతున్న గ్రామస్తులు

వాంకిడి(ఆసిఫాబాద్‌): కట్టుదిట్టమైన భద్రత, ఉద్రిక్త పరిస్థితుల మధ్య వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని చౌదరి శైలజ అంత్యక్రియలు పూర్తయ్యాయి. పోలీసుల ఆంక్షలతో చాలామంది బంధువులు చివరి చూపునకు దూరమయ్యారు. రోజుల తరబడి చికిత్స అందించినా బిడ్డ ప్రాణం దక్కకపోవడంతో శైలజ తల్లిదండ్రులు మీరాబాయి, తుకారాం, తమ్ముడు నవనీత్ రోదించిన తీరు చూపరులను కలిచివేసింది. వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని శైలజ సోమవారం నిమ్స్‌లో మృతి చెందగా గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ప్రభుత్వ అంబులెన్స్‌లో మంగళవారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో స్వగ్రామం ధాబాకు మృతదేహం చేరింది. మాలీ సంక్షేమ సంఘం, విద్యార్థి సంఘాల నాయకులు గ్రామానికి చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు సమక్షంలో చర్చలు జరిపారు.

పోలీసుల పహారా

శైలజ మృతి చెందిన విషయం తెలియగానే వాంకిడిలో పోలీసులు బలగాలను మోహరించారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల వద్ద, ధాబా గ్రామం, రోడ్డు వెంట బారికేడ్లు ఏర్పాటు చేశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు, ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం ఆధ్వర్యంలో భద్రత చర్యలు చేపట్టారు. ఆశ్రమ పాఠశాల వైపు వెళ్లే దారిని పూర్తిగా మూసివేయగా, ధాబాకు వెళ్లే అన్ని రహదారుల్లో రాకపోకలను అడ్డుకున్నారు. అర్లీ గ్రామం వద్ద ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేసి అటువైపునకు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. శైలజను చివరిచూపు చూసేందుకు దూరప్రాంతాల నుంచి బంధువులు రాగా వారిని అడ్డుకున్నారు. మీడియా ప్రతినిధులను కూడా అనుమతించలేదు.

ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్

శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరీశ్‌బాబు సైతం ప్రభుత్వం ఎదుట పలు డిమాండ్లు ఉంచారు. కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం తరుపున ఎమ్మెల్సీ దండే విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు చర్చలు జరిపారు. బాధిత కుటుంబంతో పాటు గ్రామ పెద్దలతో మాట్లాడారు. ఎక్స్‌గ్రేషియా విషయాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని, అలాగే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయం కింద రూ.20 వేలు, అంత్యక్రియలు, తదితర ఖర్చుల నిమిత్తం రూ.లక్ష నగదు అందించారు. విద్యార్థి సంఘాల నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. నాయకులు కొంతసేపు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

విద్యార్థినుల అస్వస్థతపై తేలని కారణాలు..

ఆశ్రమ పాఠశాలలో 60 మందికి పైగా విద్యార్థినులు అస్వస్థతకు గురి కాగా.. దానికి కారణాలను అధికారులు ఇప్పటికీ వెల్లడించలేదు. ఘటన జరిగిన రెండు రోజులకు సరుకుల శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించగా రిపోర్టు ఫలితాల్లో ఎలాంటి విషపదార్థాలు లేవని తేలింది. మరో వారం రోజుల అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ఆర్డీవో లోకేశ్వర్‌రావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. మరుసటి రోజు కూడా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగింది. విద్యార్థులతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని పిలిచి అస్వస్థత గురైన రోజు ఏం జరిగిందని ఆరా తీశారు. కానీ విచారణ ఆలస్యం కావడంతో విచారణలో ఎలాంటి లోపాలు బయటికి రాలేదు. అదేరోజు రాత్రి ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా హెచ్‌ఎం శ్రీనివాస్‌తోపాటు మరో నలుగురు సిబ్బందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న శైలజ పరిస్థితి విషమించడంతో మరుసటి రోజే హెచ్‌ఎంను సస్పెండ్ చేశారు. అస్వస్థతతో ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోయినా ఇప్పటికీ అసలు కారణాలు వెల్లడికాకపోవడం గమనార్హం.

న్యాయం జరిగే వరకూ పోరాటం



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌: గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేశారు. వాంకిడి మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందిన శైలజ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా బుధవారం విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు చిరంజీవి, దినకర్, కార్తీక్, టీకానంద్, తిరుపతి, శ్రీకాంత్, ప్రణయ్, రాజ్‌కుమార్, వికాస్, మహేశ్, శ్రీకాంత్, సాగర్, పోచన్న, తిరుపతి, నిఖిల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అన్యాయం : ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

శైలజ కుటుంబానికి అన్యాయం జరుగుతుంది. చర్చలు పూర్తిగా విఫలమయ్యాయి. న్యాయపరమైన డిమాండ్లతో ముందుకెళ్లే వారిపై దాడికి దిగుతున్నారు. విద్యార్థులకు భద్రత కల్పించడంతో ప్రభుత్వం విఫలమైంది. ఇందిరమ్మ ఇల్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారు. విద్యార్థి సంఘాలపై దాడి చేయడం సరికాదు. రాష్ట్రంలో పోలీసు బలగాలతో విచిత్రమైన పాలన సాగిస్తున్నారు.

రాష్ట్రంలో నిర్బంధ పాలన : ఎమ్మెల్యే హరీశ్‌బాబు



మాట్లాడుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో నిర్బంధ పాలన కొనసాగిస్తోంది. విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరిస్తోంది. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి. నైతిక బాధ్యతగా భావించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క రాజీనామా చేయాలి. న్యాయం అడిగేందుకు వెళ్లే వారిపై పోలీసు బలగాలతో నిర్బంధం విధిస్తున్నారు. విద్యార్థి కుటుంబానికి అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడాలి.



రోదిస్తున్న తల్లి మీరాబాయి, తమ్ముడు నవనీత్



అర్లీ గ్రామం వద్ద బంధువులను అడ్డుకుంటున్న పోలీసులు



విద్యార్థి సంఘాల నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌: వరిధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 8,012 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ చెల్లిస్తున్నామన్నారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు జరగకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు తాగునీరు, నీడ, ఇతర మౌలిక వసతులు కల్పించాలని, గన్నీ సంచులు, టార్పాలిన్ల కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం విక్రయించిన మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయన్నారు. ప్రతీ కేంద్రానికి ఒక అధికారిని నియమిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఆర్‌డీవో దత్తారావు, జిల్లా సహకార శాఖ అధికారి రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు వైజ్ఞానిక ప్రదర్శనలు

- డీఈవో యాదయ్య



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలో ఈ నెల 27, 28 తేదీల్లో బాల వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ రెండు రోజులపాటు నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనలు విజయవంతం చేసేందుకు కమిటీలు అంకితభావంతో పనిచేయాలన్నారు. జిల్లా నుంచి మొత్తం 108 ఇన్‌స్పైర్ మానిక్ ప్రాజెక్టులు, 200 బాలవైజ్ఞానిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. 400 మంది విద్యార్థులు గైడ్ టీచర్లతో కలిసి నూతన ఆవిష్కరణలు ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, భోజనం వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ఎంఈవో సుభాష్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి నిధులు

- డీఆర్‌డీవో దత్తారావు



కూలీలను సన్మానిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్‌: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లాలో ఉపాధిహామీ పథకం కింద చేపట్టే అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు డీఆర్‌డీవో దత్తారావు తెలిపారు. మండలంలోని బాబాపూర్, ఎల్లారం గ్రామ పంచాయతీల్లో నూతన అంగన్‌వాడీ, పశువుల పాక నిర్మాణానికి మంగళవారం డీపీవో భిక్షపతితో కలిసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే ఉత్తమమైందని అన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు తెలిసేలా ప్రజాపాలన విజయోత్సవాలు విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో శ్రీనివాస్, సీడీపీవో సాదియా, ఏపీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'ట్యాంపరింగ్ ఆరోపణలు కొట్టివేత'

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం) ట్యాంపరింగ్‌కు గురికావని వ్యాఖ్యనిస్తూ సుప్రీంకోర్టు ఈవీఎంల ట్యాంపరింగ్ ఆరోపణలను కొట్టివేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. భారత ఎన్నికల్లో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసిందన్నారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు మాత్రమే కొందరు నాయకులు ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు.

గోయేగాం శివారులో బెబ్బులి

- సీసీ కెమెరాలకు చిక్కని పెద్దపులి
- గాలిస్తున్న అటవీశాఖ అధికారులు
- మహారాష్ట్ర సరిహద్దులోని ఖండి దేవస్థానం వద్ద పులి వీడియోలు వైరల్



కోస్టాడ అడవుల్లో పులి జాడ కోసం వెతుకుతున్న అటవీ అధికారులు, సిబ్బంది

వాంకిడి(ఆసిఫాబాద్‌): మండలంలోని బండకాస, ధాబా గ్రామాలకు చెందిన ఐదు పశువులపై ఆదివారం దాడి చేసిన పెద్దపులి సోమవారం గోయేగాం అటవీ ప్రాంతంలోకి వచ్చింది. ఇక మంగళవారం కూడా అక్కడే సంచరిస్తున్న ఆనవాళ్లు కనిపించాయి. రెండు రోజులుగా పులి సంచారం ఈ అడవుల్లోనే ఉండటంతో రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. పశువులపై దాడి అనంతరం సిబ్బంది సోమవారం పాదముద్రలు గుర్తించి పలుచోట్ల నాలుగు సీసీ కెమెరాలు అమర్చారు. కానీ పులి కదలికలు గోయేగాం, సోనాపూర్ అడవుల వైపు ఉండటంతో సోమవారం సాయంత్రం ఈ ప్రాంతాల్లో పరిశీలించారు. కానీ కచ్చితమైన ఆనవాళ్లు లభించలేదు.

ఎకో బ్రిడ్జి మీదుగా..

మహారాష్ట్ర సరిహద్దులో నాలుగు వరుసల రహదారిపై నిర్మించిన ఎకో బ్రిడ్జి మీదుగా పులి తిరిగినట్లు తెలుస్తోంది. ఎఫ్‌ఆర్వో గోవింద్ సింగ్ సర్దార్ ఆధ్వర్యంలో మంగళవారం మహారాష్ట్ర అటవీ సిబ్బందితో కలిసి మహాగాం, కోస్టాడ అడవుల్లో వెతికారు. పాదముద్రలు లభించలేదని వారు తెలిపారు. మరో బృందం ఎకో బ్రిడ్జి సమీపంలో ఉండగా వారు పులి గాండ్రింపులు విన్నట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరాలకు చిక్కకపోవడంతో బెబ్బులి ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పలేమంటున్నారు. ఎకో బ్రిడ్జి, ఖండి దేవస్థానం ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం పులి సంచారం గోయేగాం అడవుల్లోనే ఉందని వారు వెల్లడించారు.

వీడియోలు వైరల్

గోయేగాం గ్రామానికి చెందిన కొందరు యువకులు పులి సంచరిస్తున్న వీడియోలు సోషల్ మీడియాల్లో పెట్టడంతో వైరల్‌గా మారాయి. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఎకో బ్రిడ్జి సమీపంలోని ఖండి దేవస్థానం మీదుగా పులి వెళ్తున్నట్లు వీడియోలో ఉంది. దీనిపై అధికారులను సంప్రదించగా ధ్రువీకరించలేదు. సోమవారం సైతం కొందరు వ్యక్తులు గోయేగాం అడవుల్లో పులి దృశ్యాలను దూరం నుంచి చిత్రీకరించారు.

దొరకని పులిజాడ



అటవీప్రాంతంలో గాలిస్తున్న అధికారులు

కెరమెరి(ఆసిఫాబాద్‌): కెరమెరి మండలంలో పులి జాడ కోసం అటవీశాఖ అధికారుల గాలింపు కొనసాగుతోంది. సోమవారం పలు గ్రామాల్లో పులి సంచారం విషయం వెలుగులోకి వచ్చినా జాడ దొరకలేదు. మంగళవారం అటవీశాఖ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి దేవాపూర్, సాంగ్వి, దేవుడ్‌పల్లి అడవులను జల్లెడ పట్టారు. వీరికి ఎక్కడా పులి ఆనవాళ్లు దొరకలేదు. అయితే మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు సమీపంలో అడుగులు గుర్తించినట్లు కొందరు తెలిపారని అధికారులు పేర్కొంటున్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్వో మజారొద్దీన్, అధికారులు విజయ్‌కుమార్, రామయ్య, నజీర్ అలీ, నర్సయ్య, దేవిదాస్ ఉన్నారు.

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో లాండ్రీషాప్ దగ్ధం

భైంసాటౌన్: పట్టణంలోని పాత థియేటర్ సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో లాండ్రీషాప్ దగ్ధమైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడు అనిల్ కథనం ప్రకారం.. రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లగా రాత్రి సమయంలో షాపులో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో ఇస్త్రీకి వచ్చిన బట్టలు, ఫర్నీచర్ పూర్తిగా దగ్ధమైనట్లు బాధితుడు తెలిపాడు. దాదాపు రూ.10 లక్షల వరకు నష్టం జరిగిందని వాపోయాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాన్సీనగర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. గోదావరిఖనికి చెందిన రాజశేఖర్ మంగళవారం పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు వచ్చి వెళ్తుండగా జాన్సీనగర్ వద్ద ఎదురుగా వచ్చిన క్యాంపర్ వాహనాన్ని ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తీసుకెళ్లారు.

మూడు మూగజీవాలు సజీవ దహనం

ఉట్నూర్‌రూరల్: విద్యుదాఘాతంతో మూడు మూగజీవాలు సజీవ దహనమైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దగంగాపూర్‌కు చెందిన సాగల సాయన్న సోమవారం రాత్రి తన రెండు ఎడ్లు, ఆవును పశువుల పాకలో కట్టేశాడు. విద్యుదాఘాతంతో పాకలో మంటలు చెలరేగడంతో మూడు మూగజీవాలు సజీవ దహనమయ్యాయి. వాటితో పాటు వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు, పంటలకు వినియోగించే మందులు దగ్ధమయ్యాయని, సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆదిలాబాద్: ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ అన్నారు. సోమవారం ఉట్నూరు డిపోకు చెందిన బస్సు ఢీకొట్టి జైనథ్ మండలంలో ఇద్దరు మృతి చెందడంతో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో మంగళవారం రోడ్డు భద్రతపై డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు ప్రతీ ఉద్యోగి పాటుపడాలని సూచించారు. చలికాలం నేపథ్యంలో పొగమంచు వలన సైతం ప్రమాదాలు జరిగే ఆస్కారం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్సై దయానంద్ పాల్గొన్నారు.

వరంగల్ హైవే భూపరిహారం పెంపు



ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ నుంచి టేకుమట్ల, ఎల్కంటి, నర్సింగాపూర్, షెట్‌పల్లి, కుందారం, కిష్టాపూర్, రొమ్మిపూర్, వేలాల, పొనూర్ మీదుగా నూతనంగా నిర్మించనున్న వరంగల్ –విజయవాడ నేషనల్ హైవే రోడ్డులో నష్టపోతున్న భూములకు ఎకరాకు సుమారు రూ.20 లక్షల వరకు పరిహారం పెంచినట్లు కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. మంగళవారం రొమ్మిపూర్ శివారులో రైతులతో మాట్లాడారు. చెట్లు, బోర్లు, పైపులు నష్టపోతున్న రైతులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతకుముందు నర్సింగాపూర్, కుందారం గ్రామాల్లో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి గన్నీ సంచుల కొరతలేకుండా చూడాలని ఆదేశించారు.

విరిగిన 33కేవీ స్తంభాలు.. నిలిచిన విద్యుత్ సరఫరా

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ శివారులో సపోర్టు వైరు తెగిపోవడంతో రెండు 33 కేవీ విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో అర్లి(టి) సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు సరఫరా నిలిచిపోయింది. ఏఈ తిరుపతి రెడ్డి సిబ్బందితో కలిసి మరమ్మతులు చేపట్టి రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.



వలస వచ్చిన పక్షి

గొల్లవాగు ప్రాజెక్ట్‌లో సంచరిస్తున్న కొంగలు

సౌత్ ఆఫ్రికా నుంచి వలస వచ్చిన జాబిన్ జాకో జాతి పక్షి

కనువిందు చేస్తున్న పక్షి

కొత్తరకం కొంగ

శివ్వారం అటవీ ప్రాంతంలో కొత్త రకం పక్షి

అతిథుల కిలకిలలు

- శీతాకాల విడిదికోసం చెన్నూర్ అటవీ ప్రాంతానికి పక్షుల వలస
- గోదావరి, ప్రాణహిత తీరంలో సందడి
- డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బృందం రాకతో వెలుగులోకి..

చెన్నూర్ దట్టమైన అటవీ ప్రాంతంలో అరుదైన పక్షులు, సీతాకోక చిలుకలు సందడి చేస్తున్నాయి. ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ నిధి (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ఉమ్మడి ఆదిలాబాద్ బృందం సభ్యులు రెండురోజుల పాటు పర్యటించారు. సౌత్ ఆఫ్రికా నుంచి వివిధ రకాల పక్షులు, సీతాకోక చిలుకలు వలస వచ్చినట్లు గుర్తించారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని శివ్వారం, గొల్లవాగు ప్రాజెక్ట్, అర్బన్ ఏకో పార్క్‌లలో ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ నిధి (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) రిసోర్స్ పర్సన్స్ రాజశేఖర్, హర్షన్, సోహన్ నాలుగు రోజుల క్రితం ఇన్‌చార్జి ఎఫ్‌డీవో సర్వేశ్వర్, చెన్నూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివకుమార్ ఆధ్వర్యంలో చెన్నూర్, మంచిర్యాల, నీల్వాయి రేంజ్ అధికారులతో కలిసి పక్షి జాతులపై సర్వే నిర్వహించారు. చెన్నూర్ ఫారెస్ట్ డివిజన్ గోదావరి, ప్రాణహిత పరీవాహక ప్రాంతంలో ఉండడంతో అరుదైన పక్షులు సౌత్ ఆఫ్రికా నుంచి శీతాకాల విడిది కోసం వలస వస్తున్నాయి. చెన్నూర్ అటవీ ప్రాంతంలో 150 రకాల పక్షులు, 72 రకాల సీతాకోకచిలుకలను గుర్తించినట్లు బృందం సభ్యులు తెలిపారు. – చెన్నూర్

ప్రాథమిక విలువలకు కట్టుబడి ఉండాలి

- బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న వీసీ గోవర్ధన్

బాసర: ప్రజాస్వామ్య దేశంలో ప్రాథమిక విలువలకు కట్టుబడి ఉండాలని, రాజ్యాంగంలో పొందుపర్చబడిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సూత్రాలను గౌరవించాలని బాసర ట్రిపుల్ ఐటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. ఆర్జీయూకేటీలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాజ్యాంగం శాశ్వతమైన విలువలను, మార్గదర్శక సూత్రాలుగా కొనసాగిస్తుందన్నారు. ఢిల్లీ ఐఐటీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మురళీ దర్శన్ మాట్లాడుతూ మన వ్యవస్థలన్నీ రాజ్యాంగంతో ముడిపడి ఉంటాయన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, కన్వీనర్ డాక్టర్ అజయ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓరియంట్ కంపెనీ పనుల అడ్డగింత



పనులు అడ్డుకుంటున్న ఆదివాసీ నాయకులు

కాసిపేట: మండలంలోని రొట్టెపల్లి గ్రామ పంచాయతీ గుట్ట ప్రాంతంలో ఓరియంట్ సిమెంట్ కంపెనీ వేస్తున్న హద్దురాళ్ల పనులను మంగళవారం స్థానిక ఆదివాసీ నాయకులు అడ్డుకున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎటువంటి అనుమతులు, పీసా గ్రామ సభ లేకుండా గుట్ట ప్రాంతాన్ని అటవీశాఖకు అప్పగించడాన్ని వ్యతిరేకించారు. కంపనీ యాజమాన్యం దొంగచాటుగా హద్దులు ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. కంపనీ సున్నపురాయి లీజు పొడిగింపులో అటవీ భూములు తీసుకుంటుండటంతో రెవెన్యూ, మైనింగ్‌శాఖల ఆధ్వర్యంలో రొట్టెపల్లి ప్రాంతంలో కంపనీ భూములు తీసుకుని అటవీశాఖకు అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా హద్దులు ఏర్పాటు చేస్తుండటంతో అడ్డుకున్నారు. గ్రామసభ ఏర్పాటు చేసి ఆమోదం పొందిన తర్వాత పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమురంభీం యువజన సంఘం అధ్యక్షుడు పెంద్రం హన్మంతు, కోవ వినోద్, చిక్రం రాందాస్, సిడం తిరుపతి, చిక్రం లింగారావ్, తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపిన కేసులో జీవితఖైదు

కుభీర్(ముధోల్): భార్యను చంపిన కేసులో భర్తకు జీవితకాలం కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ఎ.కర్ణకుమార్ మంగళవారం తీర్పుచెప్పారు. మహారాష్ట్రలోని సిరంజనికి చెందిన బాలాజీకి మండలంలోని బెల్గాం గ్రామానికి చెందిన నవనీతతో 2011లో వివాహమైంది. భార్యపై అనుమానం పెంచుకున్న బాలాజీ తరచూ మద్యం సేవించి వచ్చి ఆమెతో గొడవకు దిగేవాడు. పెద్దలు నచ్చజెప్పడంతో మండలంలోని రాజూరాకు మకాం మార్చారు. అక్కడ కూడా గొడవలు జరగడంతో నవనీత పుట్టింటికి వెళ్లిపోయింది. 2020 అక్టోబర్ 1న బెల్గాంకు వెళ్లి ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. నిజామాబాద్ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ 12న మృతి చెందింది. మృతురాలి బంధువు ముడుగుల పరశురాం ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రాథోడ్ ఉమేశ్ కేసు నమోదు చేయగా ఎస్సై ఎల్.ప్రదీప్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్ 20మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో జిల్లా జడ్జి పైవిధంగా తీర్పు నిచ్చారు.

బాసర హుండీల లెక్కింపు

- 89 రోజుల ఆదాయం రూ.1,00,30,657



హుండీ లెక్కింపులో సేవా సమితి సిబ్బంది

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో హుండీలను మంగళవారం అలయ అక్షరాభ్యాస మండపంలో ఈవో విజయరామారావు, వ్యవస్థాపక ధర్మకర్త శరత్ పాఠక్ ఆధ్వర్యంలో లెక్కించారు. 89 రోజుల హుండీ ఆదాయం రూ.1,00,30,657 నగదుతోపాటు మిశ్రమ బంగారం 143 గ్రాములు, మిశ్రమ వెండి 4.250 కిలోలు వచ్చినట్లు వివరించారు. విదేశీ కరెన్సీ నోట్లు 147 వచ్చినట్లు తెలిపారు. లెక్కింపులో ఏఈవో సుదర్శన్‌గౌడ్, ఎస్‌బీఐ బ్యాంక్, పోలీసు సిబ్బంది, దేవస్థాన హోం గార్డ్స్, వాగ్దేవి సొసైటీ సభ్యులు, శ్రీశైల భ్రమరాంబిక సేవాసమితి కామారెడ్డి జిల్లాకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

భర్తను హతమార్చిన భార్య



గులాల్ సర్కార్ మృతదేహం

ఆసిఫాబాద్: భార్య చేతిలో భర్త హతమైన సంఘటన కాగజ్‌నగర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.2 గ్రామానికి చెందిన గులాల్ సర్కార్ (44) కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గులాల్ సర్కార్ మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం కూడా దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య సరస్వతి క్రికెట్ బ్యాట్‌తో కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి కమలా సర్కార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని కాగజ్‌నగర్‌రూరల్ సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్సై సందీప్ పరిశీలించారు.

జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకం



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉత్తరాఖాండ్‌లోని హరిద్వార్ ప్రేమ్‌నగర్ ఆశ్రమంలో ఈనెల 18 నుంచి 22 వరకు నిర్వహించిన జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీల్లో హాజీపూర్ మండలం ముల్కల్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి ప్రకాశ్‌రాథోడ్ బంగారు పతకం సాధించాడు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ నగేశ్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ రమ్యారాణి, పీఈటీ కిరణ్‌కుమార్, అధ్యాపక బృందం సదరు విద్యార్థిని అభినందించారు.

కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- సర్వీస్ బుక్‌లో సంతకం చేయడం లేదని అఘాయిత్యం
- ఆర్డీవో కార్యాలయంలో పురుగుల మందు తాగిన వైనం



డీఏవో చాంబర్ ఎదుట బాధితుడు

కైలాస్‌నగర్: నిర్మల్ జిల్లాకు చెందిన ఓ రెవెన్యూ ఉద్యోగి ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టడం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలానికి చెందిన గంట అభిషేక్ వీఆర్‌ఏగా పనిచేస్తూ ఇతర శాఖలో సర్దుబాటు అయ్యాడు. 2021లో అదే మండలంలో తహసీల్దార్‌గా పనిచేసిన ఎర్రం నరేందర్‌తో పాటు వీఆర్‌ఏగా ఉన్న అభిషేక్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి విధుల నుంచి సస్పెండ్ అయ్యారు. విచారణను ఎదుర్కొన్న నరేందర్ ప్రస్తుతం ఆదిలాబాద్ ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారిగా బదిలీపై వచ్చారు. అయితే ఇతరశాఖలో సర్దుబాటు అయిన అభిషేక్ ఇంకా సస్పెన్షన్‌లోనే ఉన్నారు. ఆయన ఇతరశాఖలో సర్దుబాటు అయిన ఆ ఉద్యోగి సర్వీస్ బుక్‌లో సంబంధిత తహసీల్దార్ సంతకం తప్పనిసరిగా అవసరముంది. దీంతో ఆదిలాబాద్ డీఏవోగా పనిచేస్తున్న నరేందర్ వద్దకు సంతకం కోసం వచ్చారు. ఆయన నిరాకరించడంతో వేదనకు గురైన అభిషేక్ సదరు అధికారి ఎదుటే పురుగుల మందు తాగాడు. దీంతో ఆందోళనకు గురైన ఆర్డీవో, కలెక్టరేట్ ఉద్యోగులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి వివరాలు ఆరా తీశారు. ఈ విషయమై ఆర్డీవో వినోద్ కుమార్‌ను సంప్రదించగా ఇతర శాఖలో సర్దుబాటు అయిన ఉద్యోగి ఎస్‌ఆర్‌లో ప్రొసీడింగ్ ప్రకారం సంబంధిత తహసీల్దార్ సంతకం చేయాల్సి ఉంటుందన్నారు. కానీ ఉద్దేశపూర్వకంగా జిల్లా కేంద్రానికి వచ్చి డీఏవోను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నం చేశారన్నారు. ఏదైనా సమస్య ఉంటే సంబంధిత కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసే అవకాశం ఉన్నా ఉద్దేశపూర్వకంగానే సదరు వ్యక్తి ఘలాట సృష్టించాడన్నారు. సదరు వ్యక్తిపై డీఏవో స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతిఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి లాంగ్ టెన్నీస్ పోటీలకు ఎంపికయ్యారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఇటీవల బెల్లంపల్లిలోజరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులు హర్షవర్ధన్, వర్షిత్, చరణ్ ప్రతిభ కనబర్చారు. ఈ నెల 27నుంచి హైదరాబాద్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. సదరు విద్యార్థులను మంగళవారం ప్రధానోపాధ్యాయుడు కె.నారా యణ, ఉపాధ్యాయులు అభినందించారు.

‘శైలజ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి’

ఆదిలాబాద్‌రూరల్: కుమురంభీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కలుషిత ఆహారం తిని మృతి చెందిన విద్యార్థిని శైలజ మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ 29న ఫుడ్‌పాయిజన్‌తో దాదాపు 60 మంది గిరిజన విద్యార్థినులు ఆస్పత్రిలో చేరగా శైలజ మాత్రం 25 రోజులుగా వెంటిలేటర్‌పై ఉండి సోమవారం తుదిశ్వాస విడవడం బాధాకరమన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల హామీల అమలుకు కృషి

జైపూర్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, వేజ్‌బోర్డు శాశ్వత సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. అనంతరం ఐకే1ఏ గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, పిట్ కార్యదర్శి నవీన్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్, అఫ్రోజ్‌ఖాన్, మధుకర్ పాల్గొన్నారు.

అత్తారింటికి వెళ్తూ అనంతలోకాలకు..

- బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



తిరుపతి (ఫైల్)

మంచిర్యాలక్రైం: అనారోగ్యంతో ఉన్న భార్యను చూసేందుకు అత్తారింటికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి భరతపు తిరుపతి (31) భార్య సోనియాకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో వారం రోజుల క్రితం కాలేజిరోడ్‌లోని పుట్టింటికి వెళ్లింది. భార్యను చూసేందుకు తిరుపతి సోమవారం రాత్రి బైక్‌పై అత్తారింటికి బయలుదేరాడు. రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. స్థానికులు గమనించి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని సోదరుడు రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హెల్మెట్ ఉంటే ప్రాణాలు దక్కేవి..

తిరుపతి బైక్ అదుపుతప్పి కిందపడిపోయిన తీరును పరిశీలిస్తే హెల్మెట్ పెట్టుకొని ఉంటే ప్రాణాలతో బయటపడేవాడని స్థానికులు పేర్కొంటున్నారు. ఘటనలో అతని తలకు మాత్రమే బలమైన దెబ్బతగలండంతో మృతి చెందినట్లు చెబుతున్నారు.

కమిషనరేట్ పరిధిలో పట్టుబడిన గంజాయి దహనం

- 64 కేసుల్లో 522.544 కిలోలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ శ్రీనివాసులు



గంజాయిని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో 2021 నుంచి వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని ఇన్సినేటర్ ఫ్యాక్టరీలో మంగళవారం దహనం చేసినట్లు సీపీ ఎం.శ్రీనివాసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో 64 కేసుల్లో పట్టుబడిన రూ.1,30,38,600 విలువైన 522.544 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేసి ఎఫ్ఎస్ఎల్ కొరకు శాంపిల్ తీయగా మిగిలిన మొత్తాన్ని కరీంనగర్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తూ దహనం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌పై సీరియస్‌గా ఉందన్నారు. గంజాయి విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి విక్రయించే, సేవించే వారి వివరాలు పోలీసులకు తెలియజేస్తే సమాచారం అందించిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, సీసీఆర్‌బీ సీఐ సతీష్, ఆర్ఐ దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలి’



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐబీచౌరస్తాలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలోని సహజ సంపదలు, ప్రభుత్వ రంగాల పరిశ్రమలను బీజేపీ ప్రభుత్వం వ్యక్తుల ఆస్తులుగా మార్చడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల దాసు, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.లాల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి బ్రహ్మానందం, సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు టీ.శ్రీనివాస్, ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఇరు కుటుంబాలపై కేసు నమోదు

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన సయ్యద్ బషీర్, సయ్యద్ ఆరీఫ్ వరుసకు సోదరులు. బషీర్ గతేడాది ఇదే గ్రామానికి చెందిన వ్యక్తి భూమిని రూ.1.20 లక్షలకు కౌలుకు తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఆరీఫ్ ఆయనకు పోటీగా ఈ ఏడాది రూ.1.50 లక్షలు చెల్లించి కౌలుకు తీసుకుంటానని భూయజమానికి చెప్పాడు. ఈ విషయంలో సోమవారం రాత్రి ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఇరు కుటుంబాలు దాడులకు పాల్పడడంతో సయ్యద్ ఆరీఫ్, షేక్ హీనా, జుబేర్, సాదిక్, బషీర్, తహేర్‌కు గాయాలయ్యాయి. ఇరు కుటుంబాలు పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివరాం తెలిపారు.